సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



విద్యుత్‌ వెలుగుల్లో ఆదిత్యుని ఆలయం

బాలభానుడిపై పాలవృష్టి



అరసవల్లి సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం (ఫైల్)

బాల భానుడిపై క్షీరధార పాల వంశధారగా కనిపించింది. నగల ధగధగలు లేని అరుణ శిల అర్ధరాత్రి ప్రకాశించింది. నడి రేయి మొదలైన మంత్రోచ్ఛరణ వేకువ వరకు ప్రతిధ్వనించింది. గర్భగుడిలో ఉద్భవించిన పాల కాలువ పవిత్రంగా ప్రవహించింది. ముల్లోకాలను నిదుర లేపే స్వామికి తెల్లారే వరకు అభిషేకం జరిగింది. సూరీడి పుట్టిన రోజు వేడుకకు పురాతన అరసవల్లి వేదికైంది. భక్తకోటి సాక్షిగా కర్మసాక్షి మూర్తికి అభిషేకార్చన అపురూపంగా సాగింది.

- అర్ధరాత్రి నుంచి అరసవల్లికి పోటెత్తిన భక్తజనం
- తొలి అభిషేకం చేసిన శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి

అరసవల్లి: ప్రఖ్యాత అరవసల్లి క్షేత్రంలో గురువారం అర్ధరాత్రి రథ సప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ప్రత్యేక క్షీరాభిషేక సేవ మొదలైంది. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా అభిషేక సేవ మొదలైంది. ముందుగా పంచామృతాలు, క్షీరాది ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా ఒక్కసారిగా ఆదిత్యుని నామస్మరణతో మారుమోగింది. స్వాత్మానందేంద్రసరస్వతి స్వామికి ఆలయ సంప్రదాయం ప్రకారం చీఫ్ ఫెస్టివల్ అధికారి ఎం.విజయరాజు, ఆలయ ఈఓ రమేష్‌బాబు, ఆలయ పునర్నిర్మాత దివంగత వరుదు బాబ్జీ కుటుంబసభ్యులు, ఆలయ పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు, సభ్యులు మండవల్లి రవి, ద్వారపు అనురాధ, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, దుక్క గనిరాజు జలగడుగుల శ్రీనివాస్, డాక్టర్ కె.సోమేశ్వరరావు తదితరులతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు గౌరవ స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా గర్భాలయంలోకి వెళ్లిన స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆదిత్యునికి ప్రత్యేక విశేష పూజలు చేశారు. రాత్రి నుంచే భక్తులు తండోపతండాలుగా ఆలయానికి తరలివచ్చారు.



స్వాత్మానందేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

డీసీ హోదా.. ఆలయంలో తొలిసారిగా

ఆలయానికి ఇటీవలే డిప్యూటీ కమిషనర్ హోదా వచ్చింది. ఇంతవరకు సహాయ కమిషనర్ హోదాలో జరిగిన ఉత్సవం ఈ ఏడాది డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో జరగడం విశేషం. తొలిసారిగా డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన డీఎల్‌వీ రమేష్‌బాబు స్వయంగా స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళధ్వనుల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్, సీఎఫ్ఓ విజయరాజు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగిసన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున అందజేసిన పట్టువస్త్రాలను స్వామికి వినియోగించేందుకు చర్యలు చేపట్టారు.

పోటెత్తిన భక్తజనం

రథసప్తమి పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అరసవల్లికి తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో, ప్రధాన రోడ్డుపైన భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూల్లో నిరీక్షించి స్వామి క్షీరాభిషేకం, నిజరూపాన్ని దర్శించుకున్నారు. గురువారం అర్ధరాత్రి 12.30 నుంచి క్షీరాభిషేకం ప్రారంభమైంది. సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీ స్క్రీన్స్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్పీ జీఆర్ రాధిక నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.



అర్ధరాత్రి వేళ క్యూలో భక్తులు

1300 మంది పోలీసులతో బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్ : రథసప్తమికి 1300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు కల్పించినట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఆమె గురువారం సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు పార్కింగ్ చేసుకునేందుకు 80 అడుగుల రహదారికి ఇరువైపులా ఏర్పాట్లు చేశామని, భక్తులు తమ వాహనాలను కేటాయించిన స్థానాల్లో పార్కింగ్ చేసి సహకరించాలన్నారు.





వలంటీర్ల సేవలు అసమానం




సేవా వజ్ర నగదు పురస్కార గ్రహీతలతో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వలంటీర్లు అందిస్తున్న సేవలు అసమానమైనవని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ప్రశంసించారు. గుంటూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని ఆయన సంబంధిత అధికారులు వలంటీర్లతో కలిసి జిల్లా కేంద్రంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పథకాలను ఇంటింటికీ అందజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది వలంటీర్లకు అభినందన కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లాలో సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలు పొందిన గ్రామ వార్డు వలంటీర్లు 12,123 మంది ఉన్నారని తెలిపారు. వీరికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు.

ప్రభుత్వం వలంటీర్లకు గతం కంటే ప్రోత్సాహకాలను పెంచిందని, జిల్లాలో సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన 40 మందికి రూ.45 వేల చొప్పున బహుమతి, సేవా రత్న నగదు పురస్కారం పొందిన 171 మందికి రూ.30 వేలు చొప్పున, సేవా మిత్ర పురస్కారం పొందిన వారు 11,192 మందికి రూ.15 వేల చొప్పున బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురు వలంటీర్లు బంగారు ఉమా శంకర్ (దంది వేసి), హేమలత(అరసవల్లి), బంటుపల్లి లక్ష్మణ్ (కొర్ని), గురుగుబల్లి శివాజీ (ఆమదాలవలస), బి.లక్ష్మి (పొందూరు), బి.పాపారావు (జలుమూరు), కింజరాపు కిశోర్ (ఎచ్చెర్ల)లకు సేవా వజ్ర పురస్కారాలను కలెక్టర్ ప్రదానం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు రోజుల పాటు వలంటీర్లకు వందనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా పరిషత్ సీఈఓ డి.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి అప్పన్న, పలువురు అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

తూనికలు కొలతల శాఖ ఆకస్మిక తనిఖీ



డిక్లరేషన్ లేని గ్యాస్ సిలెండర్‌లు తనిఖీలో విజయనగరం లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు మధుసూదనరెడ్డి

కాశీబుగ్గ: తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయనగరం లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు విజయనగరం బి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలాస, కంచిలి, కోటబొమ్మాళి పట్టణాల్లో మూడు బృందాలుగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 22 సంస్థలపై కేసులు నమోదు చేశారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను బట్టి నడుచుకోవాలని అన్నారు. తనిఖీలో పలాస ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్, ఎస్ఎం రాధాకృష్ణ, ఎంవీ రమణమూర్తి, పీవీడీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీలో పలు విభాగాలకు చెందిన రాష్ట్ర కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి స్థానం కల్పిస్తూ రాష్ట్ర కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఎస్సీ సెల్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా బందపల్లి రాకేష్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శులుగా పిట్ట దామోదరరావు, కార్యదర్శిగా టంకాల బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఆరంగి లక్ష్మీపతి, పొన్నాడ వెంకటరమణలను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసన్నపేట: తామరాపల్లి శివార్లలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం శివరాంపురానికి చెందిన నక్క దుర్గారావు(34) మృతి చెందాడు. డివైడర్ దాటి నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్లే రోడ్డు మీదకు నడుచుకుని వస్తున్నప్పుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ అశిరినాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని అన్నారు.

'కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు'



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కృష్ణదాస్

జలుమూరు: మీరు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం దిశగా వెళ్లి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నాడు–నేడు పథకంలో భాగంగా రూ. 50 లక్షలతో చల్లవానిపేట ఉన్నత పాఠశాల భవనాలు నిర్మించారు. గురువారం వాటిని ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. మీకు ఇన్ని సదుపాయాలు కల్పిస్తున్నది రాజకీయాల కోసం కాదని అన్నారు. మీకు ఉజ్వల భవిష్యత్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. బాగా చదువుకుని అందరికీ మంచి పేరు తీసుకురావాలన్నారు.

జాబ్ మేళాలో 171 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగాజాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 14 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా, పదో తరగతి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగిన 509 మంది హాజరయ్యారు. కంపెనీల నిబంధనల మేరకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా 171 మంది ఎంపికయ్యారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పీబీ సాయి జాబ్ మేళా ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్య దాత.. అభయ ప్రదాత

అర్ధరాత్రి పూట అరసవల్లిలో భక్తకోటి ఆదిత్యుడిని దర్శించి తరించింది. పవిత్ర రథ సప్తమి పర్వ దినాన క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నిజరూప దర్శన భాగ్యం కలిగించడంతో భక్తులు స్వామికి కనులారా తిలకించి పులకించిపోయారు. సామాన్య ప్రజల నుంచి ప్రజా ప్రతినిధుల వరకు, ఉద్యోగుల నుంచి అధికారుల వరకు అంతా స్వామి దర్శనానికి బారులు తీరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



స్వామి సన్నిధిలో సన్నాయి మేళం



ఆదిత్యుని సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు కిల్లి కృపారాణి, అంధవరపు సూరిబాబు



ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మామిడి శ్రీకాంత్



ఆలయానికి వస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



పేరాడ తిలక్, మండవల్లి రవి తదితరులు



ఉత్సవ విధులకు సిద్ధమైన పోలీసులు



పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



జిల్లా జడ్జి జునైల్ అహ్మద్ మౌలానా



ఎంపీ పద్మావతి దంపతులు



ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



అనివేటి మండపంలో సందడి



ఆలయ పరిసరాల్లోని క్యూలో అర్ధరాత్రి వేళ భక్తులు

'ఇన్‌స్పైర్' చేశారు



కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వరరావు

- ఆదర్శప్రాయంగా ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్రస్థాయికి ఎంపికైన 16 ప్రాజెక్టులు

టెక్కలి:

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదికగా గురువారం నిర్వహించిన 11వ జిల్లా వైజ్ఞానిక ప్రాజెక్టు ప్రదర్శన అబ్బురపరిచింది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా వివిధ రకాల సైన్సు ప్రాజెక్టుల రూపకల్పన వైపు దృష్టి సారించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 164 ప్రాజెక్టులతో విద్యార్థులు హాజరయ్యారు. ఈ ప్రదర్శనల్లో భాగంగా 16 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి కె.కుమారస్వామి, ఉప విద్యా శాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎన్ఐఎఫ్ జూనియర్ సైంటిస్ట్ అభినాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆర్.శ్రీరాములు, ఎం ఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

- స్మార్ట్ క్రాప్ ప్రొటెక్షన్ సిస్టమ్ ఫ్రమ్ యానిమల్స్ అండ్ ఫైర్ యూజింగ్ ఆర్డినో (సౌర్రా జ్యోత్స్న, జెడ్పీహెచ్ఎస్, రంగోయి)
- ఉమెన్ సేఫ్టీ అండ్ ట్రాకింగ్ సిస్టమ్(సాహుకారి గౌతమి, జీహెచ్ఎస్, కస్పా నౌపడ)
- ఆటోమేటిక్ సీడ్ సౌయింగ్ స్ప్రేయింగ్ అండ్ వీడింగ్ అగ్రికల్చరల్ రోబోట్ (మల్లారి పూర్ణసాయి, టింఫనీ స్కూల్, శ్రీకాకుళం)
- లాట్ బేస్డ్ స్మార్ట్ అగ్రికల్చర్ మానిటరింగ్ సిస్టమ్ (గొలివి ధనుంజయ్, కిల్లిపాలెం, శ్రీకాకుళం రూరల్)
- యాక్టివేటెడ్ చార్‌కోల్ బేంబూ బాస్కెట్ (బోనెల పల్లవి, ఏపీ మోడల్ స్కూల్, కుప్పిలి)
- సౌండ్ అండ్ లైట్ ఎమిటేటింగ్ డివైజ్ టు రెడ్యూస్ ఎలక్ట్రిక్ షాక్స్ ఇన్ స్ట్రీట్ లైన్స్ (ముడిసి సోనియా, సత్యసాయి స్కూల్, ఇచ్ఛాపురం)
- మల్టీ పర్పస్ ఇన్నోవేటివ్ చీపెస్ట్ లోడ్ క్యారీయర్ ఫర్ ఏబౌర్ (గేదెల బిందుమాధవి,జెడ్పీహెచ్ఎస్, కంచిలి)
- ఫిల్టరేషన్ ఆఫ్ కార్బన్ ఫ్రమ్ పొల్యూటెంట్స్ బై డైనమిక్ ఫిల్టర్ విత్ అవుట్ వాటర్ (సావుకారి ఇందు, కెజీబీవీ, జి.సిగడాం)
- థెఫ్ట్ డిటెక్షన్ సిస్టమ్ ఇన్ ఏటీఎం యూజింగ్ క్లోరోఫామ్ (ననపల మనోహర్, నారాయణ, రణస్థలం)
- హీరాయిన్స్ ఫౌంటేన్ ఏ సోర్స్ ఆఫ్ ఎనర్జీ జనరేషన్ (నెయ్యిల మణికంఠ, జీహెచ్ఎస్, టెక్కలి)
- యాక్సిడెంట్ ఐడెంటిఫికేషన్ అండ్ అలెర్టింగ్ సిస్టమ్ (సుత్రోయ్ సుష్మా, జెడ్పీహెచ్ఎస్, నౌగాం, నందిగాం)
- బిన్ ఫైర్ కిచెన్ ఇన్ హోమ్ (కరణం శ్రావ్య, జెడ్పీహెచ్ఎస్, చిన్నకిట్టాలపాడు, సారవకోట)
- స్మార్ట్ డ్రైనేజ్ ఎట్ హౌస్ హోల్డ్ లెవల్ (అట్ల మహేష్,ఏపీ మోడల్ స్కూల్, సోంపేట)
- క్యాజ్యూ నట్ పికింగ్ మెషిన్ (పిన్నింటి సీతారాం ;జెడ్పీహెచ్ఎస్, మామిడిపల్లి, సోంపేట)
- వాటర్ క్లీనింగ్ రోబోట్ (వావిలాపల్లి దివ్య, జెడ్పీహెచ్ఎస్, పిల్లలవలస, పొందూరు)

అరసవల్లికి ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. విశాఖపట్టణం నుంచి శ్రీకాకుళంనకు 52 బస్సులు ఉండగా వాటికి అదనంగా మరో 10 బస్సులు నడపనున్నారు. శ్రీకాకుళం సింహద్వారం నుంచి అరసవిల్లి కూడలి వరకూ భక్తులు వెళ్లేందుకు ప్రత్యేకంగా 10 షటిల్ సర్వీస్‌ల పేరుతో నడపనున్నారు.

గ్రిగ్స్ ఫైనల్స్‌కు సై

- నేడు, రేపు శ్రీకాకుళంలో జిల్లాస్థాయి పాఠశాలల గ్రిగ్స్ ఫైనల్స్ పోరు
- వసతి, భోజన ఏర్పాట్లు పక్కాగా అందించేందుకు చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల గ్రిగ్స్ ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం, కోడి రామ్మూర్తి స్టేడియం క్రీడాప్రాంగణం వేదికలుగా శుక్రవారం నుంచి జిల్లాస్థాయి (అంతర్‌జోనల్) గ్రిగ్స్‌మీట్ ఫైనల్ పోటీలు మొదలుకానున్నాయి. కేవలం సీనియర్స్ విభాగంలో మాత్రమే జిల్లాస్థాయి ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. జూనియర్స్ విభాగంలో జోనల్ స్థాయిలోనే విజేతలుగా నిలిచిన వివిధ బాలబాలికల జట్లు/క్రీడాకారులకు పతకాలు, మెమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

16న బాలురుకు, 17న బాలికలకు..

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని టీపీఎంహెచ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ సౌజన్యంతో జిల్లాస్థాయి గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందులో తొలిరోజు బాలురుకు, 17వ తేదీన బాలికలకు పోటీలను నిర్వహించనున్నారు. 6న ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్ పోటీల ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకానున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

గ్రిగ్స్ ఫైనల్స్ మీట్‌కు జిల్లావిద్యాశాఖ నేతృత్వంలో గ్రిగ్స్ కమిటీ ప్రతినిధులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల క్రీడల సంఘం జిల్లా అధ్యక్షులు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు సూచనల మేరకు కార్యదర్శి ఆర్.విజయకుమారి, సంయుక్త కార్యదర్శి కె.మాధవరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ తదితరులు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్ ఈ ఐదు క్రీడాంశాల్లో ఎంట్రీలను నమోదు చేసుకున్న బాలబాలికలు నేరుగా హాజరుకావాలి. పోటీలు జరుగు వేదిక వద్ద జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజన ఏర్పాట్లు కల్పించనున్నారు.

'సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి'



పంచాయతీ కార్యాలయం వద్ద ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలకు మండల స్థాయిలో ఉన్న సిబ్బందిని సిద్ధం చేయాలని, ప్రధానంగా బీఎల్ఓల పనితీరును బాగా మెరుగు పరచాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడి వారి టార్గెట్స్ అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయంలో సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల్లో సౌకర్యాలు, వికలాంగులు వచ్చేందుకు ర్యాంపులు గురించి ఈఆర్‌ఓ రామ్మోహనరావు, ఏఆర్‌ఓ కనకారావులను ప్రశ్నించి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో దేనికీ ఇబ్బంది ఉండకూడదని ఒకటికి పది సార్లు పరిశీలించి సౌకర్యాలు మెరుగు పరచాలని సూచించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌ఓ పనితీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా బీఎల్‌ఓ సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో వారికి అవగాహన కలిగించాలని ఆదేశించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది పనితీరు, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ కోసం దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్లు గమనించి వెంటనే వాటిని క్లియర్ చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. పంచాయతీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, సిబ్బంది పనితీరుపై పంచాయతీ కార్యదర్శి నవర చిన్నారావును ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు.

శంఖారావంలో కళా X కలిశెట్టి

- లోకేష్ శంఖారావం కార్యక్రమంలో బాహాబాహీ
- ఇరువర్గాల ఘర్షణతో లావేరులో ఉద్రిక్తత
- లావేరులోనూ ఫ్లాపైన సభ
- చిన్న ప్రాంగణం సైతం నిండని దుస్థితి



కలిశెట్టి, కళా వర్గాల తోపులాట..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పార్టీ పటిష్టత కోసం నిర్వహించిన శంఖారావం ఇద్దరు నాయకుల దెబ్బలాటకు వేదికైంది. ఎన్నికల సన్నద్ధత కోసం కార్యక్రమం తలపెడితే.. బలాబలాలు నిరూపించుకునేందుకు ఇద్దరు తలపడ్డారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం వేదిక సాక్షిగా కిమిడి కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు వర్గాల మధ్య తోపులాట జరిగింది. తన్నుకునేంత వరకు వెళ్లింది. దీంతో లోకేష్ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇక లావేరు లోకేష్ సభ ఎప్పటిలాగానే పేలవంగా సాగింది. చిన్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు జనాలు తీసుకురావడం టీడీపీ నాయకులకు తలకుమించిన భారమైంది. ఎంతకీ జనాలు రాకపోవడంతో బతిమలాడి, నయానోభయానో చేసి రప్పించుకునే దుస్థితి చోటు చేసుకుంది. వచ్చిన జనాలు కూడా నిలబడలేదు. నేతల ప్రసంగాలకు ముందే జారుకున్నారు. దీంతో ఖాళీ కుర్చీలతో సభా ప్రాంగణం వెలవెలబోయింది.



తన్నులాట.. ఉద్రిక్తత

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు దగ్గరుండి గ్రూపు రాజకీయాలను రక్తికట్టించారు. తనకు పార్టీలో అంతర్గత శత్రువుగా, టిక్కెట్ పోరులో దూసుకొచ్చిన కలిశెట్టి అప్పలనాయుడిని నిలువరించేందుకు దౌర్జన్యాన్ని నమ్ముకున్నారు. లోకేష్ సభా ప్రాంగణంలోకి వస్తున్న కలిశెట్టి అప్పలనాయుడును లోపలికి రాకుండా అడ్డుకున్నారు. కళా వెంకటరావు దగ్గరుండి తన మనుషుల చేత కలిశెట్టి అండ్‌కోను లోపలికి రాకుండా తోసేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. కలిశెట్టి అప్పలనాయుడు కూడా అదే రీతిలో స్పందించారు. తనను తోస్తున్న వారిని తిరిగి తోస్తూ సభా ప్రాంగణంలోకి దూసుకొచ్చారు. ఒకరినొకరు నిలువరించుకునే క్రమంలో తన్నుకున్నారు. దీంతో లోకేష్ సభా ప్రాంగణంలో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ నాయకులు తన్నుకుంటున్నారని తెలియడంతో బలవంతంగా వచ్చిన జనాలు భయాందోళనకు గురయ్యారు. వీరి మధ్య తమకు ఏమవుతుందోనని భయపడి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు వచ్చేశారు. చివరికి కలిశెట్టి అప్పలనాయుడు వర్గం కాస్త దూకుడుగా వ్యవహరించి తమను అడ్డుకున్న వారిని తోసేసి మొత్తానికి ప్రాంగణంలోకి వచ్చారు. లోకేష్‌తో కలిసి ఆహ్వానంతో సంబంధం లేకుండా వేదిక పైకి వెళ్లారు. తాను అనుకున్న ప్లాన్ బెడిసికొట్టడంతో కళా వెంకటరావు తప్పని పరిస్థితుల్లో వెనక్కి తగ్గి వేదిక పైకి వెళ్లిన కలిశెట్టి అప్పలనాయుడును ఏమీ చేయలేకపోయారు. ఇంకాసేపు గొడవ జరిగితే ఇరువర్గాలు రక్తం కారేలా కొట్టుకునేవారు.

పసలేని ప్రసంగం..

శంఖారావం కార్యక్రమం ఏ ముహూర్తాన లోకేష్ ప్రారంభించారో తెలియదు గానీ ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడికి వచ్చిన జనాలు కూడా ఆయన సభలకు రావడం లేదు. తాజాగా లావేరు సభలో కూడా అలాగే జరిగింది. విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేసినా రానుపోనూ వాహనాలు పెట్టి, చార్జీలు ఇచ్చి, భోజనాలు పెట్టినా జనాలు రాలేదు. అతి కష్టం మీద వచ్చిన జనాలు కూడా ప్రసంగాలు ప్రారంభమయ్యేసరికి వెళ్లిపోతున్నారు. దీంతో ఖాళీ కుర్చీలను ఉద్దేశించి ప్రసంగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక లోకేష్ ప్రసంగాలైతే వినలేక టీడీపీ నాయకులే ఇబ్బంది పడ్డారు. ఏం మాట్లాడుతున్నారో, ఏం చెప్పాలనుకుంటున్నారో క్లారిటీ లేక కార్యకర్తలకు సైతం అర్థం కాక తలలు పట్టుకున్నారు. లోకేష్ ప్రసంగించే నాటికి సభా ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది.

శ్రీకాకుళంలో రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రం వేదికగా ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి ఈ మేళా జరగనుందని చెప్పారు. క్యాలిబర్ కంపెనీలో వివిధ హోదాల్లో 80 పోస్టులు, ఫ్యూచర్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో 70 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి కనీసం ఇంటర్మీడియెట్ ఆపైన కోర్సులు కలిగిన గల యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఆకర్షణీయమైన జీతంతోపాటు ఇతర రాయితీలు అందజేస్తాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువత తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కొత్తలంక సుధ కోరారు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.